


అర్ధగిరి ఆలయ హుండీ లెక్కింపు

తవణంపల్లె : అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. కానుకల ద్వారా రూ.12,18,724లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ తెలిపారు.



వరసిద్ధుని ఆదాయం రూ.1.29కోట్లు

యాదమరి: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా 21 రోజులకు రూ.1.29కోట్ల ఆదాయం వచ్చినట్లు ఛైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.



నేడు పెంచలకోనలో క్షేత్రోత్సవం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పెంచలకోన క్షేత్రంలో గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6.27	4.50
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.53

న్యూస్‌రీల్

వేడుకగా ఆరుద్ర పూజలు



ఊరందూరుకు స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీస్వామి,అమ్మవార్లు మండలంలోని ఊరందూరులో వెలసిన శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరారు. అందులో భాగంగా ఉదయం ఆలయ అలంకార మండపంలో శ్రీస్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేశారు. అనంతరం ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లు ఊరందూరు నీలకంఠేశ్వరాలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అక్కడ పూజల అనంతరం తిరిగి పానగల్, అగ్రహారం, సన్నిధివీధి, నాలుగు మాడవీధుల గుండా ఆలయానికి వేంచేపు చేశారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయ దర్శన వేళల పెంపు

ఏర్పేడు: మండలంలోని పురాతన గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో దర్శన వేళలను పొడిగించినట్లు దేవస్థానం ఛైర్మన్ నరసింహ యాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు దర్శనం ఉండేదని పేర్కొన్నారు. భక్తుల రద్దీ, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు రాత్రి 8 గంటల వరకు దర్శన వేళలను పొడిగించినట్లు తెలిపారు. ఈమేరకు న్యూఢిల్లీ ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయం నుంచి అనుమతి ఉత్తర్వులు అందినట్లు వివరించారు.

ఆనందోత్సవాల ఆసరా



ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో తిరుపతి రూరల్ లబ్ధిదారుల ఆసరా మెగా చెక్కు పంపిణీ చేస్తున్న తుడా ఛైర్మన్ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హాజరైన మహిళా సంఘాల సభ్యులు

- మహిళలకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం
- సంతల్లో రైతులకు ఉచితంగా భోజన వసతి
- చంద్రగిరి ప్రజలకు జన్మంతా రుణపడి ఉంటా
- దేశానికే ఆదర్శంగా చంద్రగిరి



తిరుపతి రూరల్: చంద్రగిరిలో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ మహిళల ఆనందోత్సవాల నడుమ పండుగ వాతావరణంలో సాగింది. శ్రీరామ నవమి పండుగ సమయంలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత పొదుపు సంఘాల రుణాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో అక్కాచెల్లెమ్మలు ఆనందంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. బుధవారం చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల్లో ఎమ్మె ల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆసరా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా 58,409 మంది లబ్ధిదారులకు మూడవ విడత రూ.64.37కోట్లు మంజూరు చేసిన జగనన్నకు కృతజ్ఞతగా పనిచేయాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలో చెప్పిన మేరకు జగనన్న వైఎస్సార్ ఆసరాగా కింద నాలుగు విడతలుగా చెక్కులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమైనా హామీ నిలుపుకుంటున్నా రని తెలిపారు. నిరుపేదల సంక్షేమం కోసం పరితపించే జగనన్నను ఆశీర్వదించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేసే జగనన్నను ఆదర్శంగా తీసుకుని తనను నమ్మిన ప్రజలకు జీవిత కాలం తోడుగా నిలుస్తానని తెలిపారు. తనకు కుటుంబం, ప్రజలు వేరు కాదని స్పష్టం చేస్తూ తన ఆదాయంలో 75 శాతం ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. దేశానికే ఆదర్శంగా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని, ఇందుకోసం రూ.430 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.



థ్యాంక్యూ సీఎం జగనన్న అంటూ పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ప్రజలకు తోడుగా మోహిత్‌రెడ్డి

తనకు రాజకీయ జన్మనిచ్చిన చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు జన్మంతా రుణపడి ఉంటానని, తన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కూడా చంద్రగిరి ప్రజలకు తోడుగా నిలబడేందుకే రాజకీయాల్లోకి వచ్చాడని ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా తనకంటే ముందు ఆ ఇంటికి వెళ్లి అండగా నిలబడుతాడని తెలిపారు. ఏప్రిల్ రెండవ వారం నుంచి చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సంతల్లో భోజన వసతి కల్పించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. సంతకు కాయగూరలు తీసుకు వచ్చే రైతులతో పాటు కొనుగోలుదారులు ఆకలితో ఇబ్బంది పడకుండా భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపే వారికి ట్యాబ్‌లు, మండల టాపర్‌గా నిలిచే వారికి ల్యాప్‌టాప్‌లు బహుమతిగా అందజేస్తానని పేర్కొన్నారు. జననేత జగనన్నను ఆదర్శంగా తీసుకుని మీ ముందుకు వచ్చిన మోహిత్‌ను ఆదరించాలని చెవిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు



తిరుపతి కల్చరల్: నగరంలో టీటీడీ అనుబంధ ప్రముఖ శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో గురువారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఈమేరకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 3 గంటలకు శ్రీరామనవమి ఆస్థానం, రాత్రి 7 గంటలకు హనుమంత వాహనంపై శ్రీరాములవారి ఊరేగింపు జరుగనుంది.

రేపు శ్రీసీతారామ కల్యాణం

శుక్రవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు టీటీడీ పరిపాలనా భవనం నుంచి ఏనుగు మీద ముత్యాల తలంబ్రాలను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకురానున్నారు.

రామోజీ దళిత వ్యతిరేకి

- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



తిరుచానూరు(చంద్రగిరి): ఆది నుంచి ఈనాడు అధినేత రామోజీరావు దళితులకు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మండిపడ్డారు. తిరుచానూరు సమీపంలోని ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 1984లో పాదిరికుప్పం హరిజనవాడ పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి ఓటేసిందనే నెపంతో శ్మశాన వాటికగా కాల్చేశారన్నారు. అప్పట్లో కనీసం సానుభూతి కూడా వ్యక్తపరచలేదన్నారు. కాంగ్రెస్ అంటే రామోజీరావుకు గిట్టకపోవడంతో అసత్యపు కథనాలు వండివార్చేవారన్నారు. కారంచేడులో ఏడుగురిని హతమారిస్తే కూడా రామోజీ రావు చంద్రబాబుకు వత్తాసు పలికారని ఆరోపించారు. రామచంద్రాపురం మండలంలో 12 గ్రామాల్లోని దళితులకు ఓటు హక్కు లేకుండా అగ్రకులాలు చేస్తే, ఎమ్మెల్యే చెవిరెడ్డి సుప్రీం కోర్టు వరకు వెళ్లి పోరాడి దళితులకు ఓటు హక్కును కల్పించారని గుర్తుచేశారు. రామోజీరావు ఏవిధంగా పైకి ఎదిగారో అందిరికీ తెలుసునన్నారు. మార్గదర్శి అక్రమాలపై విచారణ చేపట్టడంతో రామోజీరావు అవినీతి, స్కిల్ స్కాములు బయపడితే జీర్ణించుకోలేక కక్షపూరితంగా వార్తలు రాస్తున్నారన్నారని నారాయణస్వామి ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిని అభివృద్ధిని కనిపించకుండా చేసి.. చంద్రబాబును గద్దెనెక్కించేందుకు రామోజీరావు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఎవరైనా ఎస్సీ కులంలో పుట్టాలని కోరుకుంటాడా అన్న మాట కూడా రామోజీరావు కనిపించలేదా అన్నారు.

అచ్చెన్న మాటలపై అనుమానం : మంత్రి రోజా

అచ్చెన్నాయుడు మాట్లాడే మాటలు వింటుంటే అనుమానం కలుగుతోందని మంత్రి రోజా అన్నారు. 40 మంది తనకు టచ్‌లో ఉన్నారని ఆయన అంటుంటే, మీ పార్టీలో 175 సీట్లలో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక టచ్‌లో ఉన్నారా లేక ఎలాగో పార్టీ లేదు బొక్కా లేదన్నారు కదా.. టీడీపీని మూసి వేస్తారని అచ్చెన్న చెప్పిన మాటలు నమ్మి వైఎస్సార్‌సీపీలోకి రావడానికి టచ్‌లో ఉన్నారా అని ఆమె ప్రశ్నించారు. నారా లోకేష్ వార్డు సభ్యుడికి ఎక్కువగా.. ఎమ్మెల్యే తక్కువగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. వార్తల్లో నిలిచేదాని కోసం ఎమ్మెల్యే, మంత్రులకు కనీసం గౌరవం ఇవ్వకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు.

ఎస్సీ ఎస్టీలకు అండ



మాట్లాడుతున్న ఆర్డీఓ కనకనరసారెడ్డి

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీలకు డివిజనల్ విజిలెన్స్ పర్యవేక్షక కమిటీ అండగా ఉంటుందని, అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారం దిశగా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి, డీవీఎంసీ ఛైర్మన్ కనక నరసారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఫిర్యాదులను ఎప్పటికప్పుడు తన దృష్టికి కానీ, పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి కానీ తీసుకువస్తే త్వరితగతిన పరిష్కస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు కమిటీ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఇంటి పట్టాలపై కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామన్నారు. తహసీల్దార్లు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వెంకటాచలం, నందయ్య, చెంగల్ రాయులు, గోపి మాదిగ, రాస్ వెంకటరత్నం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులే అండ.. అవినీతే నిండా

వెంకటాపురం చెరువు



తిరుపతికి సమీపంలోని వెంకటాపురం చెరువు టీడీపీ హయాం నుంచి ఇద్దరు వ్యక్తుల ఆధీనంలోనే ఉంది. నాడు టీడీపీ నాయకులం అని.. నేడు అధికారపార్టీ అని చెప్పుకుంటూ చేపలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వారి అక్రమాలను తెలుసుకున్న సొసైటీ సభ్యులు సభ్యత్వాలను రద్దు చేసుకున్నారు. గత ఏడాది జూన్‌తో సొసైటీ గడువు ముగిసినా టెండర్ పిలువకుండా అడ్డుపడుతున్నారు. కొందరు అధికారులను లోబరుచుకుని తమ ఆధీనంలోనే ఉంచుకుంటూ చేపల వేటే ఆదాయంగా జేబులు నింపుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. ఇది ఉదాహరణ మాత్రమే చాలా చెరువులు కొందరి కబంధహస్తాల్లో ఉంటూ మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతోంది.

జిల్లా సమాచారం	
పంచాయతీరాజ్ చెరువులు :	356
మైనర్ ఇరిగేషన్ చెరువులు :	471
సొసైటీలు :	48
సభ్యులు :	2560

- సొసైటీల ముసుగులో దోపిడీ
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- 8 నెలల క్రితమే గడువు ముగింపు
- అనుమతులు లేకున్నా చేపల వేట
- ఒకరిద్దరి చేతుల్లో చేపల చెరువులు
- కమీషన్ల కక్కుర్తిలో మత్స్యశాఖ అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో సొసైటీల ముసుగులో కొందరు అధికారుల సహకారంతో పాతవారే చెరువులపై పెత్తనం చెలాయిస్తున్నారు. 8 నెలల కిందటే సొసైటీలకు గడువు ముగిసినప్పటికీ చెరువులను తమ ఆధీనంలోనే ఉంచుకుంటూ చేపలు పట్టి చెన్నై మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకుంటున్నారు. మత్స్యశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వ్యాపారులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా దోపిడీదారులు చెలరేగిపోతున్నారు. ఏటా జూలైలో ఏడాది కాలపరిమితికి పంచాయతీరాజ్ చెరువులతోపాటు మైనర్ ఇరిగేషన్ చెరువులకు టెండర్లు నిర్వహించాల్సి ఉంది. గతేడాది రూ.కోటి మేరకు చెరువుల టెండర్ల ద్వారా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది టెండర్లు లేకుండానే పాతవారే ఇష్టారాజ్యంగా చేపలు పట్టి అమ్ముకుంటున్నారు. సాధారణంగా టెండర్ ద్వారా వచ్చే ఆదాయంలో ఆ చెరువు ఆయకట్టుకు 50 శాతం, పంచాయితీయలకు 30 శాతం, మత్స్యశాఖకు 20 శాతం చొప్పున టెండర్ మొత్తాన్ని కేటాయించాల్సి ఉంది. అలా చేస్తే తమ జేబులు నిండవని కొందరు మత్స్యశాఖ అధికారులు అడ్డదారిలో చేపలను పట్టుకునేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చర్చసాగుతోంది. మత్స్యశాఖ అధికారులు ఇకనైనా స్పందించి చేపల చెరువులకు టెండర్లు నిర్వహించి అసలైన సభ్యులకు న్యాయం చేయాలని సొసైటీ నాయకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



టెండర్లు నిర్వహించకుండా సొసైటీ చెరువుల్లో చేపలు పట్టేందుకు వీల్లేదు. గత ఏడాది జూన్ 30వ తేదీ నాటికి సొసైటీల గడువు పూర్తయింది. తిరిగి టెండర్లు నిర్వహిస్తేనే చేపలు పట్టాలి. గడువు ముగిసిన సొసైటీల్లో చేపలు పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారణ చేస్తాం. అవసరమైతే కేసులు పెడుతాం.
–చాంద్‌బాషా, జిల్లా అధికారి, మత్స్యశాఖ

మా చెరువు ఇద్దరు చేతుల్లోనే



వెంకటాపురం చెరువు ఇద్దరు చేతుల్లోనే కొనసాగుతోంది. ఏళ్ల తరబడి వారే చేపల పెత్తనం చేస్తున్నారు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. పేరుకు మాత్రమే సొసైటీ అంటున్నారు. సొసైటీలోని సభ్యులకు ప్రయోజనం చేకూరడంలేదు.
–టి.వెంకటేష్, వెంకటాపురం

అందరికీ అవకాశం ఇవ్వండి



సొసైటీలో అందరికీ అవకాశం ఇవ్వాలి. నిజమైన మత్స్యకారులకు అవకాశం ఇస్తే ఉపాధి కల్పించినట్లు అవుతుంది. లేదంటే సొసైటీని రద్దు చేసి పంచాయతీకి ఇచ్చినా అధిక మొత్తానికి వేలం పాట పాడుకుంటారు. పంచాయతీల ద్వారానే టెండర్లు నిర్వహించే పద్ధతే బాగుందని భావిస్తున్నాం. –కపిలేశ్వరయ్య(మణి),ఆయకట్టు సంఘం వైస్ ప్రెసిడెంట్, వెంకటాపురం

నకిలీ మత్స్యకారులు



మా చెరువు ఒకరిద్దరి చేతుల్లోనే చిక్కుకుంది. అందరికీ ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సొసైటీలు ఏర్పాటు చేసింది. అయితే నకిలీ మత్స్యకారులు పెత్తనం చేస్తున్నారు. చెరువు ఆదాయం గ్రామానికి ఉపయోగపడేలా మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.
–నరేష్, రైతు, చెల్లూరు

పది పరీక్షలకు పటిష్ట భద్రత

- ఏప్రిల్ 3 నుంచి 18 వరకు పరీక్షలు
- జిల్లాలో 28,412 మంది పరీక్షలకు సిద్ధం
- హాల్ టికెట్ చూపితే బస్సులో ఉచిత ప్రయాణం
- డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పదో తరగతి పరీక్షలకు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఈవో శేఖర్‌ను ఆదేశించారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు రెగ్యులర్ విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్ టిక్కెట్ చూపితే ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు అదనపు సర్వీసులు నడపాలని తెలిపారు. జిల్లాలో 28, 412 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 152 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

క్యాంపస్ స్కూల్‌లో స్పాట్ వాల్యూయేషన్

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్‌లో జవాబుపత్రాల మూల్యాకనం(స్పాట్ వాల్యూయేషన్) ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు తగినంత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 6 ఫ్లయింగ్ స్క్వాడ్లను, సిట్టింగ్‌స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. డీఈవో కార్యాలయంలో కంట్రోల్ ఉంటుందని వెల్లడించారు. సమస్యలుంటే 9866964425, 9666 223 796, 9441330952 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల జరిగే రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. అదనపు ఎస్పీ కులశేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆనంద రెడ్డి, ప్రజారోగ్య అధికారి హరికృష్ణ, జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి,ఏపీ ఏస్పీడీసీయల్ ఎస్‌సీ కృష్ణారెడ్డి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలంతా ఆనందంగా ఉండాలి

● ప్రముఖుల శ్రీరామనవమి శుభాకాంక్షలు

తిరుపతిఅర్బన్: జిల్లా ప్రజలందరికీ శ్రీరాముచంద్రుడు తోడుగా ఉండి ఆనందాలు కురిపించాలని మంత్రులు, ప్రముఖులు శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, పర్యాటకశాఖా మంత్రి ఆర్కే రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, మద్దిల గురుమూర్తి, జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జేసీ బాలాజీ, డీఆర్ఓ శ్రీనివాసరావు వేర్వేరు ప్రకటనల్లో నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి కృపతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అలాగే ప్రజలకు సంతోషం, ఆరోగ్యం, పాడి పంటలు, సిరి సంపదలను శ్రీరామచంద్రుడు ప్రసాదించాలని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆకాంక్షించారు. శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమి వేడుకలను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌గా కోమలాదేవి



తిరుపతి అర్బన్: తిరుపతి జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా బి. కోమలాదేవి బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. తిరుమలలో మ్యారేజ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆమె తిరుపతి సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఆమె మాట్లాడుతూ పారదర్శక సేవలు అందిస్తామన్నారు.

పేదల కళ్లలో ఆనందమే జగనన్న లక్ష్యం



ఆసరా చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలు, పుష్పాభిషేకం

- ఏ ఒక్క హామీని అమలు చేయని మోసగాడు చంద్రబాబు
- ఇచ్చిన మాట కోసం జగనన్న కట్టుబడ్డారు
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా : పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్న లక్ష్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. చంద్రబాబు అధికారం కోసం ఎంతకైనా దిగజారుతాడు.. పచ్చి అబద్ధాల కోరు .. ప్రజలకు ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయని మోసగాడు..అని నిప్పులు చెరిగారు. తిరుపతి ఇందిరా మైదానంలో వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆరువేల మంది లబ్ధిదారులతో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్న 14 సంవత్సరాలు మోసపూరిత పాలనతోనే ప్రజలను మభ్యపెట్టి నెట్టుకొచ్చారన్నారు. 2014లో 'నేను మారిపోయాను.. నన్ను నమ్మండి' అంటూ ప్రజల ముందుకు వచ్చారని, ఇంటికో ఉద్యోగం ఇస్తా, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తా, విద్యార్థులకు సైకిళ్లు ఇస్తా, బాబు వస్తే జాబ్ గ్యారెంటీ అంటూ ఆరువందలకు పైగా హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారన్నారు. అక్కాచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి నట్టేట ముంచారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక తన నిజస్వరూపాన్ని చంద్రబాబు చూపించి ప్రజలతో ఛీకొట్టించుకున్నారన్నారు. తన పాలనలో ఈ మంచి చేశాను అని చెప్పి ప్రజల్లోకి వచ్చే ధైర్యం చేయలేక ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్ల చంద్రబాబు ప్రవర్తిస్తున్న తీరును గమనించాలని తెలిపారు. పాదయాత్రలో జగనన్న ప్రజలతో మమేకమై వారి విజ్ఞప్తి మేరకు ఎన్నికల మ్యానిఫెస్టోను నవరత్న పథకాలతో రూపొందించారన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను వంద శాతం అమలు చేసే దిశగా నాలుగేళ్ల పాలన సాగిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన జగనన్న పక్షాన నిలబడ్డ ప్రజలపై చంద్రబాబు ద్వేషం పెంచుకుంటూ అవాస్తలపై గ్లోబెల్ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

రూ.3.32 లక్షల కోట్ల లబ్ధి

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రూ.709 కోట్లు మాత్రమే సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూర్చారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రూ.3.32 లక్షల కోట్లు మహిళలకు లబ్ధి చేకూర్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 31లక్షల మందికి ఇంటిపట్టాలు మంజూరు చేశారని, రూ.50వేల కోట్లతో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. తిరుపతి నగరంలో 24 వేల మంది అక్కాచెల్లెమ్మలకు ఇంటిపట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు రాజకీయాల కోసం డ్వాక్రా మహిళలను బెదిరించి సభలకు తరలించేవారన్నారు. తాము మీకు ఈ మేలు చేశామని చెప్పుకునేందుకు మాత్రమే గౌరవప్రదంగా సభకు ఆహ్వానించామని చెప్పారు. పేదలందరికీ కార్పొరేటర్ వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్యశ్రీని బలోపేతం చేశారని గుర్తు చేశారు. కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, మెప్మా పీడీ రాధ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు ప్రవళ్లికారెడ్డి, పోటూరు ఆంజనేయులు, నారాయణ, మునిరామిరెడ్డి, ఆదం రాధాకృష్ణారెడ్డి, కెసి రేవతి, దూది కుమారి పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,250
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,471

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,300
రిటైల్ వెండి గ్రాము	రూ.74.30

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	23
చిత్తూరు	37	24
తిరుమల	32	20
గూడూరు	38	26
నగరి	37	24

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి రూరల్: తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపల్, మండల, పంచాయతీల్లో గురువారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా సెలవు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెల్లింపు కేంద్రాల్లో విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగం పేరుతో నయా మోసం

- ఆన్‌లైన్ ద్వారా రూ.11లక్షలను చెల్లించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు

చంద్రగిరి: వర్క్‌ఫ్రమ్ హోం చేస్తూ అదనపు ఆదాయం పొందవచ్చునని ఆన్‌లైన్ మోసగాళ్ల మాటలు నమ్మి ఓ వ్యక్తి రూ.11లక్షలను ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు... చంద్రగిరి మండల పరిధిలోని మామిడిమానుగడ్డ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా ఇంటి వద్ద నుంచి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని మహిళ ఆ ఉద్యోగికి ఫోన్‌చేసి తమ కంపెనీలో పనిచేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చునని నమ్మబలికింది. దీనిని నమ్మిన వ్యక్తి మూడు టాస్క్‌లను పూర్తిచేయడంతో వెంటనే అతనికి నగదును బదిలీ చేశారు. ఈ క్రమంలో మోసగాళ్లు సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని టెలిగ్రాంలోని ఓ గ్రూపులో సభ్యుడిగా చేర్చాడు. తమ కంపెనీతో పాటు కొన్ని ట్రేడింగ్‌లలో పెట్టుబడి పెట్టడం ద్వారా అధిక ఆదాయం కూడా పొందవచ్చునని ఆ గ్రూపులో తెలిపారు. అత్యాశకు పోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మొదట రూ.2వేలు, రూ.5వేలు, రూ.19వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ నగదుకు రెట్టింపుతో తిరిగి చెల్లించడంతో మరింత ఆశకు పోయి విడతల వారీగా సుమారు రూ.11లక్షలకు పైగా నగదును బదిలీ చేశాడు. ఎంతకీ ఆ నగదు తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన తిరిగి అదే నంబర్లకు ఫోన్ చేసినా ఫలితం లేకుండాపోయింది. మోసపోయినట్లు గ్రహించి ఆన్‌లైన్ ద్వారా తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ ఆదేశాలతో బాధితుడుని విచారించి, సైబర్ మోసగాళ్లకు నగదు బదిలీచేసిన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు.

ఆయుర్వేద కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్లు



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాలకు మూడు విభాగాల్లో ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయి. టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఈవో ఏవీ ధర్మారెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ సర్టిఫికెట్లు అందుకున్నారు. విద్యుత్ పొదుపు, పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణ, ఉత్తమ విధానాలు అమలు చేస్తున్నందుకు సర్టిఫికెట్లు లభించాయి. ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఇతర అధ్యాపకులు, సిబ్బందిని ఈవో ధర్మారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ఐఎస్‌వో ప్రతినిధులు శివయ్య, మౌళిక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్వీబీసీకి ..

శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ నిర్వహణలో ఉత్తమ విధానాలు అమలు చేస్తున్నందుకు గాను ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్ ఈవో ధర్మారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

చెట్టును ఢీకొని మోటార్ సైకిలిస్ట్ మృతి



మృతి చెందిన వెంకటరమణ

చిట్టమూరు : మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో బుధవారం చెట్టును ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మీభవాని వివరాల మేరకు... చిట్టమూరుకు చెందిన కృష్ణాపట్నం వెంకటరమణ(32) మోటర్ సైకిల్‌పై మొలకలపూడి గ్రామానికి వెళ్లి స్వగ్రామం వస్తున్నాడు. బైపాస్‌లో చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికితరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

గంగవరం : స్థానిక డ్రైవర్స్ కాలనీలో మంగళవారం రాత్రి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. కాలనీకి చెందిన అశోక్‌కు తమిళనాడులోని వేలూరు చెందిన నందిని(29)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి భాగ్యలక్ష్మి(2)అనే కూతురు ఉంది. అత్తామామలతో కలిసి ఉండలేక నందిని తన భర్తతో కలిసి అద్దె ఇంటికి మారింది. ఈ క్రమంలో అశోక్ తాగుడికి బానిసయ్యాడు. మద్యం అలవాటు మానేయాలని చెప్పినా వినేవాడు కాదు. దీంతో అనేక పర్యాయాలు నందిని అలిగి పుట్టింటికి వెళ్లిపోయేది. తర్వాత భార్యకు నచ్చజెప్పి తీసుకువచ్చేవాడు.

ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. అశోక్ తన కూతురును తీసుకుని తల్లిదండ్రుల ఇంటికి వచ్చేశాడు. మనస్తాపం చెందిన నందిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తిరిగి ఇంటికి వెళ్లిన అశోక్ ఈ విషయం గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నందిని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అశోక్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లితో బాల్యాన్ని బలిచేయొద్దు

- బాల్య వివాహాలను ప్రోత్సహించినా చర్యలు
- సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధన దిశగా పని చేయండి
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: బాల్య వివాహాల నివారణ సమష్టి బాధ్యతని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సోషల్ బిహేవియరల్ చేంజ్ కమ్యూనికేషన్ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న తనంలోనే వివాహాలు చేసుకోవడంతో వచ్చే అనర్థాలపై ఊరూరా అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు. 18 ఏళ్ల లోపు వారికి వివాహం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యూనిసెఫ్ మార్గ దర్శకాల మేరకు సమాజంలో పలు అంశాల్లో ఉత్తమ మార్పు, సమాచార వ్యాప్తి, ప్రేరణ, సమస్య పరిష్కారం, ప్రణాళికల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. ప్రధానంగా వైద్య విభాగానికి చెందిన వారు గ్రామీణ ప్రాంతాల్లోను మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రాల పంపిణీలో జాప్యం ఉండకూడదని, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. డీఈవో వి.శేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, సీపీవో అశోక్‌కుమార్, డీసీహెచ్ఎస్ ప్రభావతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ, సచివాలయాల ఇన్‌చార్జి సుశీలాదేవి, ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ కిషోర్, రాస్ పీడీ నాగరాజు, చైల్డ్ లైన్ అధికారి నాగమణి, ప్రగతి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

15 నుంచి విద్యుత్ ఏసీ బస్సులు

- వెన్నెల ఏసీ సర్వీసులో 20శాతం తగ్గింపు
- కోయంబత్తూరు, మధురై, మైసూర్‌కు ఏసీ బస్సులు
- వేసవిలో ఇతర రాష్ట్రాలకు అద్దె బస్సులు
- డీపీటీఓ చెంగల్‌రెడ్డి వెల్లడి



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: ఏప్రిల్ 15వ తేదీ నుంచి తిరుపతిటు కడప, మదనపల్లె, నెల్లూరుకు ఏసీ విద్యుత్ బస్సులను నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణ అధికారి(డీపీటీవో)తిమ్మాడి చెంగల్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్సుల డిపోగా అలిపిరికి గుర్తింపు లభించినట్లు పేర్కొన్నారు. అలిపిరి డిపో ఆధారంగా వంద విద్యుత్ బస్సులను ఆపరేట్ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే తిరుపతి నుంచి తిరుమలకు 50 బస్సులు నడుస్తున్నాయని వివరించారు. తిరుపతి నుంచి రేణిగుంట విమానాశ్రయానికి 14 బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి తిరుపతి–మదనపల్లె 12, తిరుపతి–నెల్లూరుకు 12, తిరుపతి–కడపకు 12 విద్యుత్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. వేసవి నేపథ్యంలో ఏప్రిల్ 16వ తేదీ వరకు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు నడుస్తున్న వెన్నెల ఏసీ సర్వీసుల్లో టిక్కెట్ ధరలో 20శాతం తగ్గించామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కోయంబత్తూరు, మధురై, మైసూర్‌కు తిరుపతి నుంచి ఏసీ బస్సులను నడుపనున్నట్లు పేర్కొన్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు వేసవిలో యాత్రలకు వెళ్లే వారికి తక్కువ ధరలకే అద్దె బస్సులను ఇవ్వనున్నట్లు చెప్పారు. వేసవిలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు వివరించారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి: కేసు నమోదు

●పావురాన్ని ట్రాక్టర్‌తో తొక్కించిన ఘటన

నాయుడుపేటటౌన్ : పావురం ట్రాక్టర్ కిందపడి మృతి చెందడంతో ఆగ్రహించిన పెంపకందారులు డ్రైవర్‌పై విచాక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమో దు చేశారు. పోలీసుల కథనం.. ఈనెల 24 తేదీ మండల పరిధిలోని దరఖాస్తుకండ్రిగ వద్ద రహదారిపై ట్రాక్టర్ వస్తుండగా ఓ పావురం ఎగురుకుంటు వచ్చి ట్రాక్టర్ కిందపడి మృతి చెందింది. గమనించిన దరఖాస్తు కండ్రిగ గ్రామానికి చెందిన పావురాల పెంపకందారులు అన్‌దీప్, వెంకట సా యి, ఆకాష్, నరేష్ మూకుమ్మడిగా ట్రాక్టర్ డ్రైవర్ పురిణి వీరయ్యపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్మాగారంలో విషవాయువులు విడుదల

• 11 మంది మహిళలకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోలింక్స్ కార్మికులు

రేణిగుంట: విమానాశ్రయం సమీపంలోని కార్బన్ కంపెనీ ప్రాంగణంలోని నియోలింక్స్ కర్మాగారంలో బుధవారం ఒక్కసారిగా ఘాటైన విషవాయువులు విడుదల కావడంతో లోపల పనిచేస్తున్న 11 మంది మహిళలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కర్మాగారం యాజమాన్యం హుటాహుటిన సమీపంలోని బాలాజి ఆస్పత్రికి తరలించింది. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను ఐసీయూలో చికిత్స అందించారు. కార్బన్ కంపెనీలో ప్రాంగణంలో జియో సెట్ టాప్ బాక్సుల కేబుళ్లు అమర్చే నియోలింక్స్ కంపెనీని నడుపుతున్నారు. ఇక్కడ షిఫ్ట్‌కు 150మంది యువతులు పనిచేస్తున్నారు. బుధవారం మహిళలు పనిచేస్తున్న సమయంలో ఏసీ ద్వారం నుంచి ఒక్కసారిగా ఘాటైన రసాయన విషవాయువులు విడుదలయ్యాయి. నిమిషాల వ్యవధిలోనే అక్కడ పనిచేస్తున్న మహిళలు ఆ వాయువులను పీల్చి అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో కంపెనీ సిబ్బంది వారిని సమీపంలోని బాలాజి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. మొత్తం 11మందిని చేర్చగా, వారిలో 10మంది కోలుకున్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెకు ఐసీయూలో చికిత్స అందించారు. ఆమె కూడా కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. తొలుత గ్యాస్ లీకైనట్లు పుకార్లు వినిపించినా గ్యాస్ లీకేజికి ఆస్కారం లేదని కంపెనీ ప్రతినిధులు కొట్టిపారేశారు. అయితే విషవాయువులు ఎక్కడ నుంచి విడుదలయ్యాయో కంపెనీ యాజమాన్యం నోరు విప్పడం లేదు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బారెడ్డి కంపెనీ చేరుకుని పరిశీలించారు. ఘటనపై విచారణ చేస్తున్నారు.